క్లుప్తంగా

పల్ల వెంకన్న ట్రస్టు వితరణ



కుట్టు మెషీన్, గ్రైండర్ అందజేస్తున్న పల్ల వెంకన్న ట్రస్టు సభ్యులు

కడియం: స్థానిక హైస్కూల్‌కు రూ.8 వేలు విలువైన కుట్టుమెషీన్, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహానికి రూ.పదివేలు విలువైన గ్రైండర్‌ను పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్టు తరపున శనివారం అందజేశారు. ఈ మేరకు స్థానిక హైస్కూల్లో హెచ్‌ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు పల్ల సుబ్రహ్మణ్యం, పల్ల గణపతి, పల్ల వెంకటేష్ వీటిని అందించారు. స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, వసతి గృహం వార్డెన్ ఏవీవీ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జేఎన్ రోడ్డు, చెరుకూరి ఫంక్షన్ హాలు రోడ్డు, సూర్య ఫంక్షన్ హాలు, మహాలక్ష్మి టెంపుల్ వీధులు, వేంకటేశ్వర నగర్, హ్యాపీ స్ట్రీట్, వాకర్స్ రోడ్డు, ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాలలో సరఫరా ఉండదన్నారు.

21, 22 తేదీల్లో జాతీయ వర్క్‌షాప్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాలలోని ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఈ నెల 21, 22 తేదీలలో 'మెట్‌ల్యాబ్/ఆక్టావా' అంశంపై జాతీయ స్థాయి వర్క్ షాప్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే శనివారం తెలిపారు. భౌతిక శాస్త్రం, ఎలక్ట్రానిక్స్ విభాగాల ఆధ్వర్యంలో జరిగే ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనడానికి డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులు, ఆసక్తిగల అధ్యాపకులు రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు అవకాశం కల్పించామన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ డి.సంజీవ్ కుమార్ రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరిస్తారన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఫిజిక్స్ విభాగాధిపతి సీహెచ్ కోమల లక్ష్మితో కలిసి ఆయన విడుదల చేశారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



చిన్నారులను పరీక్షిస్తున్న డాక్టర్ అశోక్ కుమార్

సీటీఆర్ఐ: చంటి పిల్లలకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారిలో రోగ నిరోధక శక్తిని పెంచవచ్చునని అంబేడ్కర్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ అశోక్ కుమార్ అన్నారు. రాష్ట్ర బాలల సురక్ష (ఆర్‌బీఎస్) కార్యక్రమాన్ని శనివారం ఆయన అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించారు. అంగన్ వాడీ చిన్నారుల ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ శాతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌వీఎస్ఎస్ఎస్ కుమారి, ఏఎన్ఎం ఎం.మేరీ కుమారి, ఆశా వర్కర్ ఎం.సూర్యావతి పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: కంగువా
సూర్యమినీ	: వెనమ్, సింగం ఎగైన్
సూర్యప్యాలెస్	: కంగువా
శివజ్యోతి	: మట్కా
అనుశ్రీ	: క
స్వామి	: అమరన్
అశోక	: లక్కీ భాస్కర్
రాజా	: మట్కా
రంభ	: బఘీరా
ఊర్వశి	: కంగువా
మేనక	: జితేందర్‌రెడ్డి, జాతర
కుమారి	: దేవర
అప్సర	: మట్కా
నామవరం	
వీఎస్ మహల్	: కంగువా
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: మట్కా
కడియం	
వెంకటసూర్య	: కంగువా

నిఘాపై నిర్లక్ష్యం

- పని చేయని ప్రభుత్వ సీసీ కెమెరాలు
- ప్రైవేటు వాటిపైనే ఆధారం

కడియం: హత్యలు, ప్రమాదాలు, దొంగతనాలు తదితర నేరాలు జరిగినప్పుడు ఆ కేసుల దర్యాప్తును పోలీసులు చాలా పకడ్బందీగా చేస్తారు. నిందితులను పట్టుకునేందుకు అవసరమైన ప్రతి చిన్న అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ఆ సమయంలో వారికి సీసీ కెమెరాల పుటేజీ చాలా కీలకంగా మారుతుంది. దాన్ని పరిశీలిస్తే చాలా కేసుల్లో ఆధారాలు దొరుకుతాయి. మూడో కన్నుగా భావించే క్లోజ్డ్ సర్క్యూట్ (సీసీ) కెమెరాలు కేసుల దర్యాప్తులో అత్యంత కీలకం. అవి వాటి నిర్వహణలో నిర్లక్ష్యం వెంటాడుతోంది.

రూరల్ నియోజకవర్గంలో..

రూరల్ నియోజకవర్గంలోని ప్రధాన జంక్షన్లలో పలుచోట్ల ప్రభుత్వం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. కేసుల దర్యాప్తులో అత్యంత కీలకమైన వీటిపై నిర్లక్ష్య నీడలు అలముకున్నాయి. అవన్నీ ప్రస్తుతం అలంకార ప్రాయంగా మాత్రమే మారాయి. దీంతో ప్రైవేటు వ్యక్తులను ప్రోత్సహించి ఏర్పాటు చేయించేందుకు పోలీసు శాఖ విస్తృత ప్రయత్నాలు చేపట్టింది. ప్రధాన కూడళ్లు, ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను స్థానికుల సహకారంతో ఇప్పటికే ఏర్పాటు చేశారు. మిగిలిన చోట్ల కూడా పెట్టించేందుకు ఆయా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

నాణ్యత లేక..

ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసే సీసీ కెమెరాల నాణ్యత సక్రమంగా లేకపోవడం, వివిధ కారణలతో డేటా మిస్ కావడంతో అనేక ఇబ్బందులు కలుగుతున్నాయి. దర్యాప్తు సమయాల్లో పదే పదే ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించడంతో వారి నుంచి సహాయ నిరాకరణ కూడా ఎదురవుతోంది. దీంతో ప్రభుత్వమే ప్రత్యేకంగా వాటిని ఏర్పాటు చేసి, నిర్వహణ బాధ్యతలను స్థానిక పోలీసులకు అప్పగిస్తే మేలన్న భావన సర్వత్రా వినిపిస్తోంది. ఇప్పటికే పలు చోట్ల ఏర్పాటు చేసిన వాటిని అందుబాటులోకి తీసుకువస్తే సరిపోతుంది.

కడియం మండలంలో..

కడియం మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తులకు చెందిన 157 వరకు సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయి. కీలక దర్యాప్తు దశలో వీటిలో ఎన్ని ఉపయోగపడతాయన్నది సందేహమేనని పోలీసులే చెబుతున్నారు. నిర్వహణ సక్రమంగా లేకపోవడం, పిక్చర్ క్వాలిటీ తక్కువగా ఉండడం, డేటా నిర్వహణ లేకపోవడం తదితర కారణాలతో స్పష్టమైన చిత్రాలను పొందలేకపోతున్నట్లుగా చెబుతున్నారు. అయితే అత్యంత కీలకమైన సీసీ కెమెరాలను ప్రధాన జంక్షన్లు, ముఖ్యమైన ప్రదేశాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేస్తే మంచిదనే వాదన వినిపిస్తుంది.

జాతీయ రహదారిపైనా కొరతే..

నిత్యం వందల వాహనాలు ప్రయాణించే జాతీయ రహదారిపై కూడా సీసీ కెమెరాల ఏర్పాటు అంతంత మాత్రంగానే ఉంది. ఏదైనా కేసుల దర్యాప్తు విషయంలో సంబంధిత హైవే సిబ్బందిని సంప్రదించినప్పటికీ ప్రధానమైన జంక్షన్లలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదన్న విషయం బయటపడుతోంది. కడియం మండలం దుళ్ల గ్రామంలో ఒక రైతుకు చెందిన రెండు గేదెలు, రెండు దూడలను దొంగలెత్తుకుపోయారు. గ్రామంలో అందుబాటులో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు రెండు వాహనాలను అనుమానించారు. వాటి ఆచూకీ కోసం హైవేపై ఉన్న వాటిని పరిశీలించేందుకు వెళితే అక్కడ చుక్కెదురైంది. తుని సమీపంలోని టోల్‌గేటు వద్ద మాత్రమే పుటేజీ లభ్యమైందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అత్యంత కీలకం

కేసుల దర్యాప్తులో సీసీ కెమెరాలు అత్యంత కీలకంగా మారాయి. వీటిని పరిశీలించి నిందితుల ఆచూకీని తేలికగా కనిపెట్టవచ్చు.

- కడియపులంకలో సంచలనం రేపిన రౌతు కస్తూరి హత్యాచారం కేసులో సీసీ కెమెరాల్లో ఆమె రాకపోకలను గుర్తించిన తరువాతే, ఆమెకు ఏమైనా జరిగి ఉంటుందన్న సందేహం తలెత్తింది. దర్యాప్తును ముందుకు తీసుకువెళ్లడంతో ఇది కీలకంగా మారింది.
- మండల కేంద్రమైన కడియంలో వరుసగా బైక్‌లను చోరీ చేస్తున్న నిందితుడిని గుర్తించి, పట్టుకోవడంలో కూడా సీసీ కెమెరాలే తోడ్పడ్డాయి.
- దాదాపు ఎనిమిదేళ్ల క్రితం కడియం మండలం దుళ్ల గ్రామంలో ఐదుగురు వ్యక్తులు నిద్రలో ఉండగా పెట్రోలు పోసి తగుల బెట్టిన ఘటనలో పెట్రోల్ బంక్‌లోని సీసీ కెమెరాలో నిందితుల కదలికలను గుర్తించి కేసును ఛేదించారు.



కడియం మండలం దుళ్లలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ సీసీ కెమెరా

గాలి నాణ్యతను పెంచడానికి చర్యలు



మెషీన్‌ను ప్రారంభించిన అనంతరం అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌లో భాగంగా నగరంలో గాలి నాణ్యతను పెంచడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. దీనిలో భాగంగా ఎన్క్యాప్ నిధులతో కొనుగోలు చేసిన వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మెషీన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ వాహనం ద్వారా మంచి నీటిని గాలిలోకి చల్లటం ద్వారా గాలిలోని కాలుష్యం తగ్గుతుందన్నారు. అలాగే దుమ్ము, ఇతర వ్యర్థాలు కూడా తగ్గిపోతాయన్నారు. వాహనంపై ఏర్పాటు చేసిన స్ప్రేమెషీన్ ద్వారా నీటిని చల్లుతామన్నారు. కాలుష్య ప్రాంతాలను గుర్తించి, అక్కడ వాహనం ద్వారా నీటిని వెదజల్లాలని, దానిలో భాగంగా నెలకు సరిపడే షెడ్యూలు తయారు చేయాలన్నారు. ఈ వాహనంపై పనిచేయడానికి వీలుగా అందరు డ్రైవర్లకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండింగ్ ఇంజినీర్ జి.పాండురంగారావు, జీపీఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రీటా, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల భద్రతకు అనేక చట్టాలు



సదస్సులో మాట్లాడుతున్న 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి పద్మ

కంబాలచెరువు: పని ప్రదేశాలలో మహిళలకు భద్రత కల్పించేందుకు అనేక చట్టాలున్నాయని 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి బి.పద్మ అన్నారు. 'పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధ చట్టం 2013'పై శనివారం జిల్లా ప్రధాన న్యాయస్థాన ఆవరణలోని డీఎల్ఎస్ఏ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైంగిక వేధింపులు, అసభ్యకర కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతి కార్యాలయంలో ఈ విషయాలపై చర్యలు తీసుకునేందుకు ఆ సంస్థకు సంబంధించిన అధికారులు, ఉద్యోగులతో కూడిన అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఉంటుందన్నారు. పని దేశాలలో మహిళలకు ఎలాంటి లైంగిక వేధింపులు ఎదురైనా వెంటనే ఈ కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. విచారణ జరిపిన తరువాత తగిన రీతిలో కమిటీ చర్యలు తీసుకుంటుందన్నారు. న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు మాట్లాడుతూ సహ ఉద్యోగులతో సోదర భావంతో మెలగాలని, వారికి ఇబ్బంది కలిగిలే వ్యవహరించకూడదన్నారు. పని ప్రదేశాలలో మహిళలతో మాత్రమే కాకుండా కార్యాలయాలకు వచ్చే వారితో కూడా గౌరవంగా వ్యవహరించాలన్నారు. సదస్సులో అసిస్టెంట్ కలెక్టర్ భావన హెచ్ఎస్, ఐసీడీఎస్‌పీడీ కె.విజయ్ కుమారి, రెవెన్యూ సిబ్బంది, సీడీపీవో నర్సమ్మ, వార్డు సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

కవన కార్తిక పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందుకున్న వారితో శతావధాని సందీప్ శర్మ

రాజమహేంద్రవరం సిటీ: నేటి కాలంలో కవిత్వంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, ప్రక్రియ ఏదైనా కవిత్వంలో మెరుపు ఉండాలని శతావధాని తాతా సందీప్ శర్మ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో ఆంధ్రకేసరి యువజన సమితి ఆధ్వర్యంలో కవుల కార్తికంలో భాగంగా శనివారం కవన కార్తిక సాహితీ పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శతావధాని తాతా సందీప్ శర్మ మాట్లాడుతూ కవిత్వం గురించి అనేక విషయాలు వివరించారు. విశిష్ట అతిథి డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ కవిత్వం సమాజంలో ఎంతో కొంత మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కవిత్వం పద్య రూపంలో గొప్ప పాత్ర పోషించిందని చిలకమర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు పెరుమాళ్ల రఘునాథ్ తెలిపారు. అనంతరం డాక్టర్ ఆర్.జానకీరావు, పీఎస్ రవికాంత్, డాక్టర్ ప్రిస్కిల్లా, డాక్టర్ బి.సుబ్బలక్ష్మి, పి.విశాలాక్షి, వాగ్దేవు నాగమణి, పి.సుధా, జీఎస్ఎల్ కాత్యాయని, పరిశోధక విద్యార్థి ఎం.రాజు, అధ్యాపకుడు ర్యాలీ శ్రీనివాసులుకు కవన కార్తిక పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏకేసీ కళాశాల చైర్మన్ అసదుల్లా అహ్మద్, తెలుగుశాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు, విశ్రాంత ఉపాధ్యాయులు ప్రయాగ సుబ్రహ్మణ్యం, ఆంధ్రకేసరి యువజన సమితి అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామ నాయుడు, ప్రధాన కార్యదర్శి మాదిరాజు శ్రీనివాసు పాల్గొన్నారు.

అల్లుకుపోయినా పట్టించుకోరా!



జాస్తి బుల్లెమ్మాయి మహిళా కళాశాల సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న పాదలు



జీవీఎస్ కల్యాణ మండపం సమీపంలో విద్యుత్ తీగలపై పాకిన పొదలు



హుకుంపేట డిబ్లాకులోని టిడ్కో గృహాల వద్ద పరిస్థితి

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న స్తంభాలకు పిచ్చి పొదులు అల్లుకుపోయాయి. స్తంభాలను పూర్తిగా కప్పివేస్తూ విపరీతంగా పెరిగిపోయాయి. వీటి వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. హుకుంపేట డి బ్లాకు, మోరంపూడి నుంచి శాటిలైట్ సిటీ వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో ఈ పొదలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కడియం మండల ప్రాథమిక వైద్యులు

పి.దేవానందం	వీరవరం	98660 04454
బుడిత గోపాలకృష్ణ	వీరవరం	96181 28583
సుధా దేవీవరప్రసాద్	దామిరెడ్డిపల్లి	99513 27110
సీహెచ్ఎస్ఎస్‌బీ కామరాజు	వేమగిరి	98486 15360
సీహెచ్ విఘ్నేశ్వరరావు	వేమగిరి	9394745560
గుబ్బల శ్రీనివాస్	వేమగిరితోట	9000816628
షేక్ నూర్జహాన్	వేమగిరి	96525 36983
సీహెచ్ నరసింహారావు	వేమగిరి	97041 93499
గట్టి శ్రీనివాస్	వేమగిరి	95507 27808
మచ్చా సుబ్రహ్మణ్యం	వేమగిరి	90308 28462
వై. దుర్గారావు	వేమగిరి	98665 93898
ఉండ్రాసపు ప్రసాద్‌బాబు	కడియం	99493 63242
కేశవదాసు వెంకటనారాయణ శర్మ,	కడియపుసావరం	93910 05334
సుంకర శ్రీనివాసరావు	మాధవరాయుడుపాలెం	98494 69100
షేక్ రెహ్మాన్‌సాహెబ్	జేగురుపాడు	98660 06787
తిరునామాల సుదర్శనం	జేగురుపాడు	99493 59118
పీవీ నాగసత్యనారాయణ	మురమండ	98665 93916
గంపల భానుప్రకాష్	మురమండ	98663 27915
కాకరపర్తి మరిడయ్య	దుళ్ల	99855 63382
మేకా పార్థసారథి	దుళ్ల	99122 09855
కంచిపాటు కొండబాబు	దుళ్ల	97052 18843
సాదే శ్రీనివాసరావు	దుళ్ల	90002 64616
ఎంపీఎంఆర్ సుబ్రహ్మణ్యం	వేమగిరి	99632 12809
పరిమి స్వామిబాబు	కడియపులంక	93933 89113

పుత్ర హనోక్‌కు పాన్ ఇండియన్ అవార్డు



పురస్కారాన్ని అందుకుంటున్న పుత్ర హనోక్

సీటీఆర్ఐ: స్థానిక బర్మా కాలనీకి చెందిన జేఎస్ఎస్ డబ్ల్యూ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు పుత్ర హనోక్‌కు పాన్ ఇండియన్ 2024 నేషనల్ అవార్డు లభించింది. పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం హైదరాబాద్ బిర్లా ప్లానిటరియంలోని ఆడిటోరియంలో ఈ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పుత్ర హనోక్‌కు శాసన మండలి సభ్యుడు, ప్రొఫెసర్ ఎం.కోదండరాం జ్ఞాపిక, పతకం, ప్రశంసాపత్రం అందజేశారు. కాగా.. పుత్ర హనోక్ మూడు దశాబ్దాలుగా జేఎస్ఎస్ మినిస్ట్రీస్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలలో అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. వృద్ధులు, దివ్యంగులు, కుష్ఠు రోగులకు సేవలు అందిస్తున్నారు. సామాజిక కార్యక్రమాలతో పాటు, కరోనా సమయంలో నిరుపేదలకు నిత్యావసరాలు వితరణ చేశారు. మహిళల అభ్యున్నతికి కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు కుట్టుమెషీన్లు కూడా పంపిణీ చేస్తున్నారు. ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారం అందజేశారు. గజల్ శ్రీనివాస్, రొయ్యూరు శేష సాయి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

రాజానగరం: ప్రభుత్వ సహకారంతో చేపట్టిన పేదల ఇళ్ల నిర్మాణాలను డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తయ్యేలా పనిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులకు ఆదేశించారు. ఈ లక్ష్యంలో ఇప్పటి 13 శాతం మాత్రమే పూర్తి అయిందని, మిగిలిన లక్ష్యాన్ని సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజమహేంద్రవరంలోని పేదలకు వెలుగుబందలో గత ప్రభుత్వం పంపిణీ చేసిన స్థలాలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 3,396 ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా, 683 మాత్రమే పూర్తయ్యాయన్నారు. వివిధ దశలలో ఉన్న మిగిలిన నిర్మాణాలను వేగవంతం చేసి, లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. లబ్ధిదారులను గ్రూపులుగా ఏర్పాటు చేసి, వారి సమస్యలను తెలుసుకుని, వాటికి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. అలాగే వారితో వాట్సాప్ గ్రూప్‌లను కూడా ఏర్పాటు చేయించి, నిరంతరం పనుల ప్రగతిని సమీక్షించాలని సూచించారు. ఆమె వెంట గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి ప్రాజెక్టు మేనేజర్ కేఎల్ శివజ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్ బీవీ గిరి పాల్గొన్నారు.

పురమందిరం పరిరక్షణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్



ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో అయ్యంకి చిత్రపటానికి నివాళులు

రాజమహేంద్రవరం సిటీ: కందుకూరి వీరేశలింగం పురమందిరం (టౌన్ హాల్) అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. జూబ్లీ పబ్లిక్ లైబ్రరీ ఆధ్వర్యంలో జరుగుతున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టౌన్‌హాల్‌లోని చారిత్రక గ్రంథాలయ పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జూబ్లీ లైబ్రరీ సెక్రటరీ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, స్టేట్ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎర్ర వేణుగోపాలరాయుడు, జూబ్లీ లైబ్రరీ అధ్యక్షుడు జగన్నాథం వెంకటరెడ్డి, ఆర్లపల్లి నాగబోస్, రెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

త్యాగ ఫలితాలే గ్రంథాలయాలు

కడియం: ఎంతో మంది త్యాగఫలితాలే గ్రంథాలయాలని పలువురు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక లైబ్రరీలో గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం సేవలను గుర్తు చేసుకున్నారు. హైస్కూల్ హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భాస్కరరావు, బి.రామకృష్ణ, ప్రసాద్, విశ్వేశ్వర్ తదితరులు మాట్లాడారు.

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్యను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని విశ్రాంత ప్రిన్సిపాల్ చాగంటి వెంకటలక్ష్మీ నరసింహారావు కొనియాడారు. స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన శనివారం అయ్యంకి వెంకట రమణయ్య సంస్మరణ సభ నిర్వహించారు. నరసింహారావు, విశ్రాంత లైబ్రేరియన్ వీధి లక్ష్మయ్య, సంగీతం టీచర్ పద్మలత ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మతల రమేష్, పాడిపిరెడ్డి కృష్ణశ్రీ, ఆదిరెడ్డి శ్రీనివాసు, గ్రంథాలయాధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

ఆల్కాట్‌తోట గ్రంథాలయంలో..

స్థానిక ఆల్కాట్‌తోట గ్రంథాలయంలో ఉద్యమకారుల సంస్మరణ సభ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ ఉద్యమకారులైన అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యాసరచన పోటీలకు ఎస్ఆర్ఎంసీహెచ్ స్కూల్ ఉపాధ్యాయురాలు బాల న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. గ్రంథాలయాధికారి కొత్తపల్లి రమ్య తెలిపారు.

రక్తదాన శిబిరం



రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న నాగేశ్వర్ తదితరులు

కంబాలచెరువు: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు, రోగుల కోసం శనివారం మాగ్న హాస్పిటల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. మాగ్న హాస్పిటల్, జైన్ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 164 మంది రక్తదానం చేశారు. శిబిరంలో రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, డాక్టర్ చందన పర్వత వర్ధిని, వికాస్ కుమార్, జగదీష్, విక్రమ్‌జైన్, అనిల్, అశ్విని జైన్, డాక్టర్ వినయ్‌మెహతా,చ ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్, జీఎస్ఆర్ ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం రక్తదాతలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు లక్ష దీపోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని గౌరీచంద్ర మహేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. భక్తులందరూ తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.